




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 8-4-2025

సంపుటి: 21 సంచిక: 12

పేజీలు: 8 వెల: రూ.1




- పెద్దమార్కెట్ విషయంలో కూటమి పెద్దల తొందరపాటు
- మొత్తం మార్కెట్‌నే కూల్చేస్తామనడం అనాలోచితం
- నగరంలో ప్రకంపనలు రేపుతున్న మంత్రి, కమిషనర్ ప్రకటనలు
- గతంలో ఇదే దూకుడు ధోరణితో దెబ్బతిన్న గత పాలకులు
- సమగ్ర ప్రణాళిక లేకుండా ముందుకెళితే మొదటికి మోసం



మార్కెట్ మొత్తం నేలవర్తకమే

## కెలికారో.. కూలిపోతారు!

**కూటమి ప్రభుత్వం.. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లు ఒక పెద్ద తేనెతుట్టెను కదుపుతున్నారు. కచ్చితంగా ఇది కెలికి కరిపించుకోవడమే. శ్రీకాకుళం నగరంలోని పొట్టిశ్రీరాములు పెద్ద మార్కెట్‌ను పునర్నిర్మిస్తామంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన ప్రకటన ఇప్పుడు నగర వ్యాపారవర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కొత్త మార్కెట్ కాంప్లెక్స్ నిర్మిస్తామంటే.. అది కూడా వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని ప్రకటిస్తే కలవరం, కలకలం ఎందుకన్న ప్రశ్న తలెత్తొచ్చు. కానీ ఆలూ లేదు చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం అన్నట్టు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి మార్కెట్‌లోకి అడుగు పెట్టిన వెంటనే ప్రస్తుత మార్కెట్ భవనాలను కూల్చేస్తామని.. వాటి స్థానంలో కొత్త మార్కెట్ భవనాలు నిర్మిస్తున్నామని మంత్రి ప్రకటించడం.. అది చాలదన్నట్లు వారం పదిరోజుల వ్యవధిలోనే షాపులు ఖాళీ చేసేయాలని కమిషనర్ ఆదేశించడమే ఈ కలవరానికి కారణం.**



వాహనాలు వెళ్లేందుకే స్థలం లేదంటే.. రోడ్డును ఆక్రమించేసిన మేదర్లు

మార్కెట్‌లో నడిచేందుకు వీలులేకుండా నేలవర్తకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రస్తుతం పెద్ద మార్కెట్‌లోని పలు భవనాలు నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవం. అలా అని అవి పూర్తిగా పనికిరాకుండాపోలేదు. శ్రీకాకుళం వ్యాపార సరళిని బట్టి కొన్నిషాపులు ఖాళీగా మిగిలిపోయాయి. అందుకు బాధ్యులు గత ప్రభుత్వంలో ఉన్నవారైతే.. ఇప్పటి కూటమి ప్రభుత్వ పెద్దలు కూడా అదే పంథా అనుసరిస్తూ పెద్ద తప్పు చేస్తున్నారు. పెద్దమార్కెట్‌కే వచ్చారో లేక బాబూ జగ్జీవన్‌రామ్ జయంతికి రాలేదు కాబట్టి మార్కెట్ పెద్దల ఆహ్వానం మేరకు అక్కడున్న రామమందిరంలో పూజలకే వచ్చారో తెలీదు గానీ అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు, గొండు శంకర్‌ల బృందం పెద్దమార్కెట్‌లో ఆదివారం అడుగు పెట్టింది. సహజంగానే మార్కెట్‌లో సమస్యలున్నాయని అక్కడి వ్యాపారులు వారికి చెప్పుకొచ్చారు. అంతే.. అక్కడికక్కడే అచ్చెన్నాయుడు ఒకే ఒక్కడు సినిమాలో అర్జున్ స్టైల్‌లో రూ.25 కోట్లతో కొత్త మార్కెట్ కాంప్లెక్స్ నిర్మిస్తామని ప్రకటించేశారు. అంతవరకు బాగానే ఉంది. అచ్చెన్నాయుడు వెళ్లిన మరుసటి రోజే పెద్దమార్కెట్‌ను ఈ నెల 15లోగా స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని.. లేదంటే తామే తొలగిస్తామంటూ కార్పొరేషన్ కమిషనర్ స్వయంగా పర్యటించి మరీ ప్రకటించారు. అందులో భాగంగా వ్యాపారులకు ఓ సంకేతం ఇవ్వడానికి కొన్ని రేకు షెడ్లను తొలగించారు కూడా. ఆదివారం మంత్రులు రావడం.. సోమవారమే తొలగింపు కార్యక్రమం మొదలవడంతో తమకు ప్రత్యామ్నాయం చూపించకుండా మార్కెట్‌ను కూల్చేస్తామనడం పట్ల వ్యాపార వర్గాలు భగ్గుమంటున్నాయి. ఎందుకంటే.. ఇప్పటికే ఒకసారి మోసపోయామన్న భావనలో పెద్దమార్కెట్ వర్తకులు ఉన్నారు.

### నాడు మార్కెట్‌కు ఒక రూపు తెచ్చినా..!

పెద్దమార్కెట్ రూపురేఖలు మార్చడానికి ఐడీఎస్ఎంటీ స్కీమ్ కింద రూ.2.50 కోట్లు, మున్సిపాలిటీ నుంచి రూ.1.20 కోట్లు వెచ్చించి అదనంగా ప్రత్యేక షెడ్లు వేసుకునేందుకు - మిగతా చివరి పేజీలో




• ఎడిటోరియల్

# అంకురించని యువశక్తి!

యువకుల మేధస్సును, వారి శక్తియుక్తులను మన పథకాలతో అనుసంధానం చేయకుండా పురోగతి ఎలా సాధ్యం? దేశీయ పెట్టుబడిదారులు అంకుర సంస్థలను, యువ మేధావులను ప్రోత్సాహించకుండా విదేశీ కార్పొరేటు భాగస్వామ్యానికి అర్రులు చాస్తున్న పరిస్థితుల్లో యువకులు విదేశాల వైపు చూస్తున్నారు. మంచి లాభాలు వస్తాయని భావించే సంస్థలను విదేశీ పెట్టుబడిదారులు గుర్తించి, ఆర్థిక తోడ్పాటు పేరుతో వాటిని ఆకర్షించి 'ఆదుకుని' ఆనక వాటిని తమ హస్తగతం చేసుకుంటున్నారు. ఈ తరహా విదేశీ దోపిడీని తరిమి వేయకుండా ఎంత బాధ పడినా ఏం ప్రయోజనం? కనీసం చైనా సాగిస్తున్న స్వతంత్ర అభివృద్ధి పంథాను మనమూ అనుసరించాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ప్రభుత్వం తాను కోరుకుంటున్న ఉన్నత సాంకేతిక సంస్థల ప్రారంభానికి తగిన వాతావరణం కల్పించాలి. వనరులు, ఆర్థిక సహాయం అందించటంపై దృష్టి సారిస్తే మేలు జరుగుతుంది. ప్రభుత్వ నినాదాలు నాదస్వరంలా వీనుల విందుగా ఉన్నా ఆచరణలో ఎందుకు వెనుకబడి ఏన్నామనేది అసలు ప్రశ్న. దేశీయ పెట్టుబడులు ఎందుకు రావటం లేదో ప్రభుత్వం తెలుసుకోవాలి. విదేశీ కంపెనీలు వీటి పట్ల ఎందుకు ఆకర్షితులవుతున్నారో తెలియాలి. గతంలో ప్రధాన మంత్రిగా వ్యవహరించిన లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్, జైకిసాన్' అని నినదించారు. దానికి వాజ్‌పేయి హయాంలో 'జై విజ్ఞాన్' అని కలిపారు. ప్రస్తుత ప్రధాని మోదీ దాన్ని మరింత విస్తరించి 'జై అనుసంధాన్' అంటున్నారంటే శాస్త్ర పరిశోధనను మరింతగా అభివృద్ధి చేయాలని అర్థం. కానీ ఆ దిశగా తగిన కార్యాచరణే లోపిస్తోంది. ఫలితంగా రూ.25 లక్షలు, రూ.50 లక్షల చిన్న మొత్తాలకు కూడా భారతీయ యువ మేధావులు తమ అద్భుత మేధో ఆవిష్కరణలను విదేశీ పెట్టుబడిదారులకు అమ్మేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితి ఎంత త్వరగా మారితే మన దేశానికి అంత మంచిది. మనదేశంలో స్టెమ్ (సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్‌మెటిక్స్) పట్టభద్రులు చాలా ఎక్కువ. వేలాది యువత ఏటా డిగ్రీలు చేత బట్టుకుని కాలేజీల నుంచి బయటకు వస్తున్నారు. కానీ వారి చదువులకు, నైపుణ్యాలకు తగిన పని కల్పించలేకపోతున్నారు. ఫలితంగా వారు ఉపాధి పేరుతో స్విగ్గీ, జొమాటో వంటి సంస్థలకు సేవకులుగా మారిపోతున్నారు. ఈ దుస్థితి చాలా దయనీయం. దీన్ని దృష్టిలో పెట్టుకుని యువతరం కోసం మరింత పూనికతో కృషి చేయాలి. కానీ పెట్టుబడి రుణాలు కూడా సరిగ్గా, సమయానికి అందక, ప్రభుత్వంలోని బ్యూరోక్రటిక్ పద్ధతులు, అవినీతి, బాధ్యతారాహిత్యంతో విసిగిపోయిన యువకులు నిర్వేదంతో, నిరుత్సాహంతో వేరే గత్యంతరం లేక తమ పరిశోధనా ఫలితాలను, ఆవిష్కరణలను విదేశీ పెట్టుబడిదారులకు అమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే.. దేశప్రగతిలో యువ మేధస్సును భాగస్వామ్యం చేయాలి. సెమీ కండక్టర్లు, కృత్రిమ మేథో రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టి స్వయం పోషకత్వం సాధించాలి. ఆత్మ నిర్భరతతో భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా కంప్యూటర్ చిప్స్, ఏఐ మోడల్స్ తయారీ చేపట్టాలి. రాబోయే తరాల అవసరాలకు అనుగుణంగా రోబోటిక్స్ రంగాన్ని అభివృద్ధి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచంలోని ఏ మూలకైనా వస్తువులను చేరవేయగలిగే సప్లై చైన్లు, హై స్పీడు రవాణా సౌకర్యాలు అభివృద్ధి పరచటంతోపాటు ప్రపంచ వాణిజ్యాన్ని నిర్దేశించే స్థాయిలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. స్పేస్ టెక్నాలజీ, బుల్లెట్ ట్రైన్లు, ఇంధన రంగాల్లో సాంకేతిక కృషితోపాటు భారీగా మౌలిక వసతులు పెంచాలి. యువతను నిర్వీర్యం చేసే బెట్టింగ్, జూదం లాంటి యాప్‌లను నియంత్రించి యువశక్తిని ఉత్పత్తి రంగంలోకి మళ్లించి ప్రగతిరథ చక్రాన్ని పరుగులు పెట్టించాల్సిన అవసరాన్ని పాలకులు గుర్తిస్తే మంచిది. అభివృద్ధిలో మనపక్కనున్న చైనా దూసుకుపోతుండటానికి ఇటువంటి చర్యలే దోహదం చేస్తున్నాయి. ఫలితంగా ఎలక్ట్రిక్, బ్యాటరీ, రవాణా వాహన తయారీ , సెమీ కండక్టర్, తదితర రంగాల్లో చైనా అమెరికా తదితర దేశాలకు ధీటుగా ఎదుగుతోంది. ఈ విషయంలో చైనాను మన పాలకులు స్ఫూర్తిగా తీసుకుంటే మేలు జరుగుతుంది. ఈ పరిస్థితిపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ ఒక సందర్భంలో మాట్లాడుతూ 'మనం యువకుల్ని ఫుడ్ డెలివరీ బాయ్‌లుగా మార్చుతుంటే, చైనావారు సెమీకండక్టర్లు, కృత్రిమ మేథ రంగాల్లో వారిని తీర్చిదిద్దుతున్నారు' అని వ్యాఖ్యానించడం వాస్తవ చిత్రాన్ని అంగీకరించడమే. భారత, చైనా దేశాల్లోని అంకుర సంస్థల పనితీరును పోల్చి చూస్తూ తగిన మార్పులు చేసుకోవాల్సిన అవసరాన్ని మంత్రి చెప్పకనే చెప్పారు. కానీ వాటిని ఆచరణలో పెట్టడమే ముఖ్యం.

# వైద్య ఆరోగ్యశాఖను భ్రష్టు పట్టించారు

* ప్రత్యేక అధికారిని నియమించాలి
* నీటి ఎద్దడికి అధికారులే బాధ్యులు
* జిల్లా అభివృద్ధికి సహకరించాలి
* వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖను అధికారులు భ్రష్టు పట్టించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తున్న సందర్భంలో మంత్రి మాట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిస్థితి చాలా ఘోరంగా ఉందన్నారు. చాలామంది ఉద్యోగులు ఏళ్లతరబడి పాతుకుపోయారన్నారు. జిల్లా కార్యాలయంలో పని చేస్తున్నవారి జాబితాను ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖలో డెప్యూటేషన్లు అన్నీ రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తక్షణమే ఒక ప్రత్యేక అధికారిని నియమించి సమీక్ష నిర్వహించాలని కలెక్టర్‌కు ఆదేశించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిధుల సమస్య లేదని, నీటిఎద్దడి ఏర్పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో చేపడుతున్న పనులు వివరించారు. అనంతరం సమావేశంలో రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం, ఇచ్ఛాపురం ఎంపీపీ నిమ్మన దాసు మాట్లాడుతూ పైప్‌లైన్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఇచ్ఛాపురం, పలాస పనులపై మంత్రి ఆరాతీసి పనులు వేగవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం ప్రవేశపెట్టిందని, ప్రతీ ఇంటికి తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలో ట్యాంక్ ఉండి తాగునీరు అందించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. జలజీవన్ మిషన్ పథకం 2028 వరకు పొడిగించినట్టు తెలిపారు. జిల్లాలో ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన నీరు అందించేందుకు తొలిదశలో రూ.2వేల కోట్లు మంజూరైనట్టు తెలిపారు. టెండర్ వేసి ప్రారంభించిన జలజీవన్ పనులు రద్దు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు విపక్ష ప్రజాప్రతినిధులు సహకరించాలని మంత్రి కోరారు. ఉపాధి పనుల్లో నాణ్యత లోపిస్తే ఫిర్యాదు చేయాలని సభ్యులకు మంత్రి సూచించారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి మాట్లాడుతూ పంచాయతీరాజ్ పనుల బిల్లుల చెల్లింపులకు ఆ శాఖ ఇంజినీర్లు 20 శాతం లంచం తీసుకుంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై గ్రీవెన్స్‌లో అనేక మార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. మెటీరియల్ పరిశీలించకుండా, నాణ్యత పాటించకుండా పనులు చేపడుతున్నారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్ స్పందిస్తూ నిరాధార ఆరోపణలు చేయొద్దని, అన్నింటినీ పట్టించుకుంటే పనులు జరగవన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా గ్రీవెన్స్‌లో తప్పుడు ఫిర్యాదులు చేయడం వల్ల గ్రామాల్లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ సింహాచలం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల అభివృద్ధి ఏమీ జరగటం లేదన్నారు. జి.సిగడాం జెడ్పీటీసీ గౌరవ వేతనం మూడున్నరేళ్లుగా అందడం లేదని సభ దృష్టికి తెచ్చారు. కాపు సంక్షేమ, అభివృద్ధి చైర్మన్ పాలవలస యశస్విని మాట్లాడుతూ బీసీ రుణాల స్థాయిని పెంచాలని కోరారు. ఫ్యామిలీ ప్లానింగ్‌పై రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం అడిగిన ప్రశ్నకు అధికారులు సమాధానమిస్తూ రాష్ట్రంలో జననాల రేటు పెంచడానికి ఫ్యామిలీ ప్లానింగ్‌ను గతంలో మాదిరిగా ప్రోత్సహించడంలేదన్నారు. ముందుగా జెడ్పీ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం మృతికి సంతాపం తెలిపి మౌనం పాటించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్వీ శ్రీధర్ రాజ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.






ఊర్వశి రౌతేలా వర్సెస్ రిషబ్ పంత్ వివాదం గురించి తెలిసిందే. ఈ ఇద్దరూ గతంలో తీవ్రంగా ఘర్షణ పడినా కానీ, ఒకరితో ఒకరు ప్రేమలో ఉన్నారని అభిమానులు నమ్మారు. ముఖ్యంగా ఊర్వశి అతడంటే పడి చస్తుంది. రిషబ్ పేరెత్తితే చాలు చాలా సిగ్గుల మొగ్గయిపోతుంది. ఇప్పుడు మరోసారి రిషబ్ గురించి తనను మీడియా ప్రశ్నించగా సిగ్గు పడిపోయింది. అతడితో కలిసి ప్రకటనలో నటించే అవకాశం వస్తే నటిస్తారా? అని టీవీ చానెల్ హెూస్ట్ అడిగినప్పుడు అది ప్రకటనను బట్టి ఉంటుందని సమాధానమిచ్చింది. కానీ తన బుగ్గల్లో కెంపులు ఎరుపెక్కాయి.. సిగ్గుల మొగ్గవుతున్న వైనం బయటపడింది.

తాజా ఇంటర్వ్యూలో మీకు ఐపీఎల్‌లో ఏ టీమ్ అంటే ఇష్టం? అని హెూస్ట్ ప్రశ్నించగా, విరాట్ కోహ్లి జట్టయిన ఆర్సీబీ, ఇంకా లక్నో సూపర్ జెయింట్స్ అని చెప్పింది. ఆర్సీబీ సరే కానీ, లక్నో పేరెత్తడమేమిటీ?

## క్రికెటర్‌ని నీడలా వెంటాడున్న నటి !

అంటూ సందేహాలు మొదలయ్యాయి. ఈ సీజన్‌లో రిషబ్ పంత్ లక్నోకి ఆడుతున్నాడు. అందుకే లక్నో పేరును తెరపైకి తెచ్చిందా? అంటూ డౌట్లు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓసారి ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టంటే ఇష్టమని చెప్పింది. ఆ సీజన్ లో పంత్ ఢిల్లీకి ఆడగా.. ఈసారి అతడిని లక్నో భారీ ధరకు కొనుగోలు చేసింది. పంత్ టీమ్ మారడంతోనే ఊర్వశి రౌతెలా కూడా నచ్చిన టీమ్‌ని మార్చేసిందని నెటిజనులు కామెంట్ చేస్తున్నారు. 2024లో మాట్లాడిన వీడియో, 2025లో చాటింగ్ వీడియో రెండిటినీ కలిపి వైరల్ చేస్తున్నారు. ఈ రెండు వీడియోల్లో ఊర్వశి టీమ్ లను ఎలా మార్చిందో స్పష్టంగా కనిపిస్తోంది. ఇదంతా ఆర్పీ గురించేనని చాలా మంది కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఊర్వశితో గొడవలు ముగిసాక రిషబ్ పంత్ ఇషా నేగి అనే అందమైన అమ్మాయితో ప్రేమలో ఉన్నాడని మీడియాలో కథనాలొచ్చాయి. కానీ దీనిపై అతడు స్పష్టతనివ్వలేదు. ఇప్పటికీ ఊర్వశి ఒంటరి. రిషబ్ పై ప్రేమ ఎంతమాత్రం తగ్గలేదని తన చర్యలు చెబుతున్నాయి. గతంలో మాదిరిగానే అతడు ఆడే ఆటను స్టేడియంలో వీక్షించేందుకు విచ్చేస్తోంది. కానీ రిషబ్ మనసులో ఏం ఉందో ఎవరికీ తెలీదు. నోరాతో పోలిక సరే..! సోషల్ మీడియాలో తనను తోటి నటి నోరా ఫతేహితో పోల్చిన ట్రోలర్లను నటి ఊర్వశి రౌతేలా తీవ్రంగా విమర్శించారు. ఆన్‌లైన్ ప్రతికూలత తనను కలవరపెట్టదని ఉర్వశి స్పష్టం చేస్తూ ఈ ట్రోలింగ్ సరికాదని అంది. ట్రోలింగ్ తనను ప్రభావితం చేస్తుందా అని అడిగినప్పుడు.. నేను అందరి అభిప్రాయాలను వ్యక్తిగతంగా తీసుకోను. ప్రతికూల వ్యాఖ్యలతో నేను అంత తేలికగా ప్రభావితం కాను అని తెలిపింది. ఎవరైనా ఏదైనా అసభ్యంగా మాట్లాడితే.. అది నన్ను ఇబ్బంది పెట్టనివ్వను. ప్రతి నటి లేదా నటుడు పరిశ్రమకు తనదైన ప్రత్యేకతను తీసుకువస్తారని నేను నమ్ముతున్నాను.. అని వెల్లడించింది. నోరా లేదా ఎవరితో పోల్చినా నాకు అభ్యంతరం లేదు ఎందుకంటే ప్రతి కళాకారుడికి వారి స్వంత స్పేస్ ఉంటుందని అన్నారు. ఉత్తమంగా నటించడం ముఖ్యమని అన్నారు. సన్నీ డియోల్ టైటిల్ రోల్‌లో నటించిన "జాత్" లో ఊర్వశి ఓ ప్రత్యేక గీతంలో నర్తించిన సంగతి తెలిసిందే. 2025 ఏప్రిల్ 10న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

## కొందరిని ఏడిపిస్తాడు కొందరిని నవ్విస్తాడు

ఆ జీవి కొందరిని ఏడిపిస్తాడు కొందరిని నవ్విస్తాడు కొందరికి చిరాకు తెప్పిస్తాడు కొందరికి కోపం తెప్పిస్తాడు కొందరికి దేవుడు మరి కొందరికి దెయ్యంలా కనిపిస్తాడు.. ఒక్క మాటలో చెప్పాలంటే ఉగాది పచ్చడి లాంటోడు.. మా వైజాగ్ భాషలో చెప్పాలంటే మా మురీ మిక్చర్‌లా అన్నమాట.. మంచోడా చెడ్డోడా తెలీదు కాని ఒక జీవి 63సంవత్సరాలుగా జీవిస్తున్నాడు..అంతే!. ఆర్జీవీగారు తమరు మీకు నచ్చినట్టే జీవించండి.. మాకు నచ్చిన పాయింట్ వుంటే మెచ్చుకుంటాం లేదా తిట్టిపడేస్తాం.. అర్థం అవుతుందా.. అర్థమైనా పట్టించుకునే రకం కాదు కదా.. పొరపాటున కూడా హేపీ బర్త్‌డే అని విష్ చెయ్యను.. కానీ ఒక నిజం మాత్రం ఒప్పుకోవాలి.. నాకు 'లో'గా అనిపించినప్పుడు రామూయిజం చూస్తే చాలు మళ్ళీ ఉత్సాహం వచ్చేస్తుంది.. అయినా నేను పొగడను?? అబ్బా నువ్వు 'సూపర్' అని గొంతులోనుంచి నాలుక మీదకి వచ్చేసరికి ఏదో తిక్క పని చేస్తావు తిట్టుకోవలసి వస్తుంది. ఎవరైనా నన్ను ఎవరితోనైనా కంపేర్ చేస్తే కోపం కట్టలు తెంచుకుని వచ్చేస్తుంది.. అదేంటో ఫిమేల్ వర్షన్ ఆఫ్ ఆర్జీవీ, లేడీ వర్మ అంటే మాత్రం నచ్చుతుంది నవ్వుకుంటా.. 2016 లో ఫస్ట్ ఒకరు అన్నారు అది అలా కంటిన్యూ అవుతుంది.

**నోట్: కావాలంటే నేను తిట్టుకుంట మీరు తిడితే మాత్రం ఊరుకోను అంతే!!!**

**- అరుణశ్రీ**







# లాపతా లేడీస్.. కాపీ సినిమా ఆస్కార్‌కు వెళుతుందా?

లాపతా లేడీస్.. రెండేళ్ల ముందు విడుదలై ఘనవిజయం సాధించిన హిందీ చిత్రం. ఆమిర్ ఖాన్ నిర్మాణంలో ఆయన మాజీ భార్య కిరణ్ రావు ఈ చిత్రాన్ని రూపొందించింది. ఇండియా తరపున ఆస్కార్ ఎంట్రీకి కూడా ఎంపికైందీ సినిమా. కానీ అకాడమీ అవార్డు మాత్రం దక్కలేదు. ఐతే అనేక అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై ప్రశంసలతో పాటు అవార్డులూ దక్కించుకుందీ చిత్రం. థియేటర్లలో మంచి స్పందన తెచ్చుకున్న ఈ సినిమా.. ఓటీటీలో మరింత ఆదరణ దక్కించుకుంది. గత కొన్నేళ్లలో బాలీవుడ్ నుంచి వచ్చిన బెస్ట్ మూవీస్‌లో ఒకటిగా నిలిచింది. ఐతే గొప్ప సినిమాగా పేరు తెచ్చుకున్న ఈ మూవీని కాపీ కొట్టి తీశారనే ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. 2019లో విడుదలైన అరబిక్ చిత్రం 'బుర్ఖాసిటీ'కి ఇది ఫ్రీమేక్ అనే ప్రచారం జరుగుతోంది. బుర్ఖాసిటీ'లో కొత్తగా పెళ్లయిన ఓ వ్యక్తి తన భార్యను మిస్ అవుతాడు. బుర్ఖా వేసుకున్న వేరే యువతిని తన భార్య అనుకుని వెంట తీసుకెళ్తాడు. తర్వాత చూస్తే తన భార్య మారి పోయిందని తెలుసుకుంటాడు. తప్పిపోయిన తన భార్యను వెతికి కనిపెట్టి తెచ్చుకునే నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. 'లాపతా లేడీస్' స్టోరీ కూడా దాదాపుగా ఇలాగే ఉంటుంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు వేర్వేరు యువతులకు పెళ్లవుతుంది. కొత్త పెళ్లి కూతుళ్ల అవతారంలో రైల్లో ప్రయాణిస్తుండగా.. ముఖానికి పరదా పెట్టుకోవడంతో కన్ఫ్యూజ్ అయి ఒక వ్యక్తి తన భార్య అనుకుని వేరే అమ్మాయిని వెంట తీసుకెళ్లిపోతాడు. ఆ తర్వాత తన భార్యను తిరిగి తీసుకురావడానికి అతను చేసే పోరాటం ఎంత మేర ఫలించింది.. తన వెంట వచ్చిన అమ్మాయి వ్యవహారం ఏంటి.. ఈ నేపథ్యంలో సినిమా రసవత్తరంగా నడుస్తుంది. మొత్తం సినిమాను కాపీ కొట్టారని చెప్పలేం కానీ.. కాన్సెప్ట్ అయితే 'బుర్ఖా సిటీ' నుంచే తీసుకున్నట్లుంది 'లాపతా లేడీస్' టీం. అయినా సరే.. కాన్సెప్ట్ కాపీ కొట్టి తీసిన సినిమాను ఆస్కార్ ఎంట్రీకి పంపడం ఏంటి అంటూ టీం మీద ఇప్పుడు నెటిజన్లు మండిపడుతున్నారు.

## ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ కోరారు. మంగళవారం టెక్కలి పార్టీ కార్యాలయంలో సంతబొమ్మాళి మండల వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ సమావేశంలో పాల్గొని తిలక్ మాట్లాడారు. బూటకపు హామీలతో చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత రెడ్‌బుక్ రాజ్యాంగంతో కక్షసాధింపు చర్యలతోనే కాలం గడుపుతోందని,ఇచ్చిన హామీలను ఎక్కడ నెరవేర్చడం లేదని దీనిపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. అచ్చెన్నాయుడు చేపడుతున్న కక్షపూరిత రాజకీయాలను ఎదుర్కొనేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని తిలక్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు బుడ్డా మోహన్‌రెడ్డి, ఎన్ని మన్మధరావు, నక్క భీమారావులు పాల్గొన్నారు



## ఉద్యోగ భద్రత కల్పించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా సర్వ శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని యూనిటీ వెల్ఫేర్ టీం జిల్లా అధ్యక్షులు వై సత్యనారాయణ కోరారు. జిల్లాలో శని, ఆదివారాలలో ఆమదాలవలస, నరసన్నపేట, పలాస, టెక్కలిలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ సదస్సులలో ఆయన పాల్గొన్నారు. గత 12 ఏళ్లుగా ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న సుమారు 300 మంది పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్‌కు ఉద్యోగ భద్రత గాని, హెచ్‌ఆర్ పాలసీ గాని, మినిమం టైం స్కేల్ గాని ఏదైనా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలు వల్ల కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు మినిమం టైం స్కేల్ గుర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో ప్రధాన కార్యదర్శి ఎల్. దిలీప్, ఉపాధ్యక్షులు సిహెచ్. శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.కామేష్, కోశాధికారి పి.తారకేశ్వరరావు, సలహాదారు సిహెచ్.దుర్గాప్రసాదరావు ఆయా ప్రాంతాలకు చెందిన పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆరోగ్యవంతులుగా తయారుచేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న చిన్నారులను ఆరోగ్యవంతులుగా తయారు చేయాలని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి జి.శోభారాణి పేర్కొన్నారు. స్థానిక కృష్ణాపార్క్ సెక్టార్ పరిధిలో 15వ వార్డు దూదివారి సందు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు పాల్గున్నారు. వీరిని ఉద్దేశించి ఆమె పలు సూచనలు అందించారు. గర్భిణీ స్త్రీలకు పెరుగుదల పర్యవేక్షణ, మొదటి 100 రోజుల్లో పోషకాహారం ప్రాముఖ్యత 2 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల పెరుగుదల పర్యవేక్షణ తదితర అంశాలపై సూచించారు. అనంతరం పిల్లల బరువులను తూయించడం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంను అందించారు. పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మీ, వార్డు ఇంచార్జి ఇప్పిలి తిరుమలరావు, ఎంఎస్‌కే హిమబిందు, అంగన్వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, విజయ, అరుణ, నీలవేణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



## ఉగాది పురస్కార గ్రహీతకు సన్మానం



(సత్యంన్యూస్, రాజాం)

రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం దంపతులను సోమవారం రాత్రి స్థానిక 'తృప్తి మిత్రమండలి' సభ్యులు ఘనంగా సన్మానించారు. విశ్వావసు నామ సంవత్సర రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారాన్ని రంగనాథం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అందుకున్న సందర్భంగా ఈ సన్మానం నిర్వహించారు. ఉపాధ్యాయినులు కోరాడ శిరీష, లాభాన సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మానంలో వైద్య నిపుణులు డాక్టర్ గార రవిప్రసాద్, డాక్టర్ సూర్య శైలజ, షణ్ముఖ శ్రీనివాస్, ఉపాధ్యాయులు చిప్పాడ కృష్ణప్రసాద్, బలివాడ నాగేశ్వరరావు, వంతరాం ప్రదీప్, లాభాన వేణు, కూరాడ హరి, మూడడ్ల శ్రీనివాసరావు, అయ్యగారి లక్ష్మీ ప్రభ, నాగళ్ళ అప్పలనాయుడు, వాకముల్ల శంకర్, పెద్దపాటి సురేష్, రమేష్, గొల్లపల్లి కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

## వల చుట్టుకుని వ్యక్తి మృతి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



మండలంలోని మెట్టక్కివలస గ్రామానికి చెందిన ఒక వ్యక్తి చేపలవల చుట్టుకుని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మెట్టక్కివలస గ్రామం మండలవీధిలో నివశిస్తున్న జి.బాలా (47) శ్రీకృష్ణతులసి స్వదేశీయ మత్స్యకార సహకార సంఘంలో సభ్యులుగా ఉన్నారు. ఈనెల 7న కంద్రవీధికి చెందిన బెనియా దుదిష్ట బెహరా, ఆయన కుమారుడు నాగరాజుతో కలిసి బాలా చేపలు పట్టేందుకు కసింవలస చెరువుకు వెళ్లారు. వీరు పెద్దవల వేసి చేపలవేట చేస్తుండగా వీరిలో దుదుష్టి, నాగరాజులు తమకు దొరికిన చేపలు పట్టుకుని మార్కెట్‌కు వెళ్లారు. అనంతరం మళ్లీ చేపలు పట్టేందుకు తెల్లవారుజామున ఐదు గంటలకు చెరువుకు వచ్చి చూడగా బాలా మృతి చెంది ఉన్నాడు. దీనికి గల కారణం చూడగా బాలా కాళ్లకు చేపలవల చుట్టుకోవడం వలన మృతి చెందినట్లు తెలిపారు. వారు వెంటనే బాలా కుటుంబసభ్యులతో పాటు మత్స్యకార సొసైటీ చైర్మన్, సభ్యులకు తెలియజేశారు. వారు శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్సీ వర్గీకరణను ఐక్యతతో అడ్డుకుందాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా వాళ్ళ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దళితుల మధ్య వర్గీకరణ పేరుతో చిచ్చు పెట్టి వివాదాలు సృష్టిస్తున్నాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు. పి.బెంజమెన్ ఆరోపించారు. మంగళవారం ఆదివారంపేటలోని స్థానికఅంబేద్కర్ విగ్రహం నుండి ఆర్ట్స్ కళాశాల రోడ్‌లోని అంబేద్కర్ ఆడిటోరియం వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ఆమోదం చేయకుండా విభజనను ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కులాల మధ్య వర్గీకరణ పేరుతో కుంపట్లు పెట్టి అశాంతిని సృష్టిస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ సాధ్యం కాదని ప్రభుత్వాలకు తెలిసినప్పటికీ అధికారం కోసం కొందరిని అడ్డం పెట్టుకొని అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండే దళితుల మధ్య వర్గీకరణ అన్న నినాదంతో చిచ్చు రేపుతున్నారని అన్నారు. ఏది ఏమైనప్పటికీ. విభజనను అడ్డుకుని తీరుతామన్నారు. అవసరమైతే ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. అందుకు ప్రతీ పల్లె నుండి దళితులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంచిన భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. ఎం.అంబేద్కర్. విశ్రాంత తహశీల్దార్ రామప్పడు, సంజీవరావు, ఆర్.సూర్యనారాయణ, డి.గోవిందరావు, కె.తవిటయ్య, కె.రాజులు, ఎస్సీ, బీసీ.మైనార్టీ.జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్.గంజి ఆర్ఎజ్రా, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సిబ్బందికి క్యాప్స్, కళ్లద్దాల పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రానున్న వేసవి కాలం దృష్ట్యా ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది వేసవి తాపాన్ని తట్టుకునేందుకు ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి టోపీలు (క్యాప్స్), చలువ కళ్ళద్దాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళం వరం చారిటబుల్‌ట్రస్టు సౌజన్యంతో వీటిని పంపిణీ చేశామన్నారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది విధివిధానాలు, వారి సమస్యలు తెలుసుకుని పట్టణంలో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేయాలని సూచించారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా సిబ్బంది ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. శ్రీకాకుళం పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మంచినీరు, మజ్జిగ నిరంతరం అందుబాటులో ఉండే విధంగా చూస్తామన్నారు. వేసవికాలంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ఎంతో ఉపయోగపడే సామాగ్రిని వరం చారిటబుల్ ట్రస్ట్ వారు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిఎస్పీ సీహెచ్ వివేకానంద, ట్రాఫిక్ సీఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆత్మగౌరవ పోరాట దినాలు పాటిద్దాం

(సత్యంన్యూస్, మందస)

పూలే జయంతి, అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈనెల 11 నుంచి 14 వరకు దళిత,పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క క్రిష్ణయ్య పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం స్థానిక అంబేద్కర్ విజ్ఞాన మందిరంలోగల అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మిస్క క్రిష్ణయ్య మాట్లాడుతూ భారతదేశ తొలి సామాజిక మార్పు కోసం వారి జీవితాన్నే పణంగా పెట్టి, మనుస్మృతికి వ్యతిరేకంగా పనిచేసిన జ్యోతీరావు పూలే, అంబేద్కర్ వంటి మహనీయుల కృషిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో పీడిత కులాల ప్రజలు వేడుకలు చేయడం సంప్రదాయంగా కొనసాగుతుందన్నారు. ప్రస్తుత పాలకులు జ్యోతిరావు పూలేను బీసీలకు పరిమితం చేయడం, జగ్జీవన్‌రామ్‌ను మాదిగ కులాలకు, జల్,జంగిల్, జమీన్ ఉద్యమం నడిపిన కోమరంభీంను ఆదివాసీలకు, అంబేద్కర్‌ను మాల సామాజికవర్గానికి పరిమితం చేస్తూ ఉత్సవ కమిటీల్లో వేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. అశేష పీడిత ప్రజలను సమాజంలో మనుషులుగా గుర్తించని సమాజం నుండి మనుషులరకు సమానహక్కులు కల్పించేందుకు ఉద్యమించిన నాయకులను కొన్నికులాలకు పరిమితం చేయడాన్ని వ్యతిరేకిద్దామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు సంక కాళిదాసు, ఇప్పిలి చంద్రశేఖర్, జెన్న శంకర్, దుర్యోధనలు పాల్గొన్నారు.



## కిలిమంజీరా, రష్యా ఎల్బ్రోస్‌కు సిక్కోలు తేజం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పేదరికం అడ్డుతో కల, కలలుగానే మిగిలిపోతాయని, మనసున్న దాతలు సహకారమందిస్తే శ్రీకాకుళం జిల్లా మరోచరిత్ర తిరగరాస్తుందని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి లయన్ డాక్టర్ పైడి సింధూర మంగళవారం అన్నారు. స్థానిక లయన్స్‌క్లబ్ సెంట్రల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ టెక్కలి మండలం, కొండ భీంపురం గ్రామానికి చెందిన సారా చిరంజీవి చిన్ననాటి నుండి పర్వతారోహణ చెయ్యాలనే పట్టుదలతో బీపీఈడీ చదువుకుని, ఆంధ్రప్రదేశ్ నుంచి మౌంటెన్ కిలిమంజారో పర్వతం, రష్యా ఎల్రోస్‌కి అర్హత సాధించారని, ఆర్థిక స్థోమత లేక, తన చిరకాల కోరిక అలానే మిగిలిపోయిందన్నారు. దాతలు సహకరిస్తే, మౌంట్ ఎవరెస్ట్ లాంటి పెద్దపెద్ద మౌంటెన్ అధిరోహించి, మన దేశానికి మంచిపేరు తీసుకొస్తారన్నారు. ఆక్సిజన్ సిలిండర్ల సహాయం లేకుండా అధిరోహించడం తన కర్తవ్యమని చిరంజీవి చెబుతున్నారన్నారు. జీవితంలో ఒక గమ్యాన్ని చేరుకోవాలంటే కఠోరశ్రమతోపాటు, అదృష్టం కలిసిరావాలని, చిరంజీవి లాంటి వ్యక్తులకు దాతలు, స్వచ్ఛందసంస్థలు, ప్రభుత్వం, జిల్లా అధికారులు ఆదుకుంటే తప్పకుండ గమ్యాన్ని చేరుకోవటమే కాకుండా దేశానికి తప్పక పేరు ప్రఖ్యాతులు తెస్తారనటంలో సందేహం లేదన్నారు. తమవంతు సహకారం తప్పక అందిస్తామని లయన్స్‌క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ బృందం తెలిపారు. చిరంజీవి మాట్లాడుతూ అడిగిన వెంటనే తనకు వెన్ను తట్టి ప్రోత్సాహించిన లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం వారికి, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్‌లకు ధన్యవాదాలన్నారు. ఆర్థికంగా సహాయం చేయాలనుకునేవారు తన ఫోన్‌పే (9866370792)కు సహాయం చేయాలని కోరారు.

## యువత రక్తదానానికై ముందుకు రావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అత్యవసర పరిస్థితులలో రక్తదాతలే ప్రాణదాతలని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ పట్నాయక్ సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చిన్నారునికి ఓ-పాజిటివ్ రక్తం అవసరం కాగా, నగరంలో మంగువారితోటకు చెందిన కె.వెంకటేష్ తన రక్తంను స్థానిక లయన్స్ బ్లడ్‌బ్యాంక్‌లో అందించి చిన్నారి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా శివతేజ మాట్లాడుతూ యువత అపోహాలు వీడి, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చెయ్యాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, స్వచ్ఛందసంస్థలు ముందుకు రావాలని, అలాగే మన చుట్టూ పరిసర ప్రాంతాలలో జరిగే కొన్ని వేడుకలలో రక్తదానం భాగం చేయాలన్నారు. శ్రీకాకుళం నగరంలోనే కాకుండా, జిల్లా మొత్తంగా ఉన్న రక్తనిధి కేంద్రాలలో రక్త నిల్వలు నిండుగా ఉన్నాయని, వేసవిలో వృద్ధులకు, పిల్లలకు, గర్భిణీలకు ఇతరత్రా



అనారోగ్యులకు రక్తం చాలా అవసరమన్నారు. అనంతరం నేటి రక్త దాత కె. వెంకటేష్‌కు బంగారు పతకంతోపాటు, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రక్తదాత కె.వెంకటేష్, లైన్స్‌బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ వందన, ధనలక్ష్మి, మని, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

(సత్యంన్యూస్, పలాస)

సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు మంగళవారం పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణీకులు, రైల్వేశాఖ ఊపిరి పీల్చుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 7 గంటల సమయంలో పలాస రైల్వే స్టేషన్‌లో నిలిపి ప్రయాణికులను దింపిన తర్వాత ఇక్కడనుంచి హౌరా బయలుదేరింది పలాస నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న సుమ్మాదేవి రైల్వేస్టేషన్ సమీపానికి చేరేసరికి అత్యంత వేగంగా వెళుతున్న ఈ రైలుకు 15వ నెంబరు భోగి లింకు తెగిపోయింది. దీంతో పట్టాల మీదే ఎనిమిది బోగీలు ఉండిపోయాయి. రైల్వేగార్డు పైలట్‌కు సమాచారం ఇవ్వడంతో రైలును 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందస రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేశారు. రైల్వేశాఖ ఉన్నతాధికారులు సంఘటన జరిగిన స్థలానికి వెళ్లి పరిశీలించారు సంఘటన జరగడానికి కారణాలు లోపాలపై నిశితంగా దర్యాప్తు జరుపుతున్నారు. సాంకేతిక నిపుణులు రంగంలోకి దిగి మరమ్మతులు చేపట్టారు. ఈ రైలు సంఘటనతో ఈ రూటులో నడుస్తున్న రైళ్లన్నీ ఆలస్యంగా నడుస్తున్నాయి. రైలు పట్టాలు లింకు తెగిపోవడం వెనుక సక్రమంగా పరిశీలన జరపకుండా రైలు నడుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


















# కెలికారో.. కూలిపోతారు!

మొదటిపేజీ తరువాయి

మరో రూ.4 కోట్లతో నిర్మించి 2009 ఎన్నికలకు ముందు అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద రావు దీన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎంవీ పద్మావతి పని చేస్తున్న కాలంలో చేపట్టిన పెద్ద పని ఇది. అంతవరకు మార్కెట్‌కు ఒక రూపు, ఒక షేపు లేదు. అటువంటిది ఆమె హయాంలో మంత్రి ధర్మానను ఒప్పించి ఈ మార్కెట్‌ను పునర్నిర్మించ గలిగారు. ఏళ్ల తరబడి మార్కెట్‌లో అడుగు పెట్టలేని దుస్థితిని తప్పించి ఓ స్థాయిలో దీన్ని నిర్మించగలి గారు. అప్పట్లో ఇది పెద్ద విజయమే. ఎందుకంటే.. పద్మావతి నాయకత్వాన్ని కౌన్సిల్‌లోనే సొంత పార్టీ కౌన్సిలర్లు వ్యతిరేకిస్తున్న సమయంలో దానికి ఎదురీది మార్కెట్‌ను నిర్మించి ధర్మాన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించగలిగారు. సరిగ్గా అదేరోజు ప్రజారాజ్యం పార్టీ ఎన్నికల ప్రచారానికి చిరంజీవి శ్రీకాకుళంలో అడుగు పెట్టారు. జనమంతా చిరు వెంట పరుగులు తీస్తుంటే.. మార్కెట్ తరఫున అంధవరపు రఘురామ్, జామి జనార్ధన, ఏఎన్ఆర్ రాజు వంటి ఓ నలుగురు మాత్రమే ధర్మాన తరఫున పని చేస్తున్న రోజుల్లో ఈ ప్రారంభోత్సవాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేశారు.

### పాత గాయాన్ని కెలుకుతున్నారా?

కట్ చేస్తే.. పాత మార్కెట్‌ను ఖాళీ చేయించి నప్పుడు వ్యాపారులకు ఇచ్చిన హామీని అప్పటి ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయింది. దాని ఫలితమే 2014 ఎన్నికల్లో ధర్మాన ప్రసాదరావు ఓటమి అని చెప్పకతప్పదు. ఎందుకంటే.. 2009లో దీన్ని ప్రారంభించినా 2010 తర్వాతే వ్యాపారులకు దీన్ని అందించారు. షాపుల కోసం డ్రా తీయగా.. కొందరికి ఫస్ట్‌ఫ్లోర్‌లో షాపులు వచ్చాయి. నగరంలోని జీటీ రోడ్డులోనే ఫస్ట్‌ఫ్లోర్‌లో వ్యాపారాలు లేవంటే, మార్కెట్‌కు వచ్చి ఫస్ట్‌ఫ్లోర్‌లో ఎవరు కొంటారంటూ వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో వారికి న్యాయం చేస్తామంటూ 2010 నుంచి 2014 ఎన్నికల వరకు నాయకులు ప్రయత్నించినా సఫలం కాకపోవడంతో వ్యాపారులు పెద్ద ఎత్తున ధర్మానకు వ్యతిరేకంగా మళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు టీడీపీ కూడా మార్కెట్ అంశాన్ని కెలికి తన గొయ్యి తానే తవ్వుకుంటున్నదన్న భావన ఏర్పడకమానదు. మార్కెట్‌ను పునర్నిర్మించకముందు మూడు రకాల సైజుల్లో షాపులు ఉండేవి. సైజును బట్టే వాటి అద్దెలుండేవి. పునర్నిర్మాణానికి ముందు 120 షాపులు గ్రౌండ్‌లో ఉండేవి. పక్కా భవనాలు ఏర్పడిన తర్వాత వాటిని 90కి కుదించారు. షాపుల కేటాయింపునకు తీసిన డ్రాలో 30 మందికి ఫస్ట్‌ఫ్లోర్‌లో రావడంతో వారెవరూ వాటిని తీసుకో లేదు. అప్పట్నుంచి ఆ 30 మంది వ్యాపారులు తమకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే షాపులు కేటాయించా లంటూ దాదాపు నాలుగేళ్లు తిరిగినా ఫలితం దక్కక పోవడంతో అప్పటి అధికార పార్టీకి పెద్ద ఎత్తున నష్టం జరిగింది. అప్పుడు కూడా 2006లో మార్కెట్‌ను యుద్ధప్రాతిపదికన ఖాళీ చేయించి శంకుస్థాపన చేశారు. కానీ షాపుల కేటాయింపు దగ్గర మాత్రం సమన్యాయం చేయలేకపోయారు. అప్పటికప్పుడు షాపులు ఖాళీ చేయాల్సి రావడంతో మార్కెట్ పరిసర ప్రాంతాల్లో దేనికీ పనికిరాని షాపులను ఎక్కువ అద్దెలు చెల్లించి మరీ కిరాణా వర్తకులు తీసుకున్నారు. తీరా మార్కెట్‌లో తమ పాత షాపులు రాకపోవడంతో అక్కడ అంతంత అద్దెలు చెల్లించలేక దాదాపు 120 మంది తమ వ్యాపారాలను మూసేశారు. అదే సమయంలో పెద్ద మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా నగరంలో అనేక దిక్కుల్లో చిన్నచిన్న మార్కెట్లు వెలసి నిలదొక్కుకున్నాయి. ఉదాహరణకు కోవిడ్ విపత్కర కాలాన్నే తీసుకుంటే.. స్థానిక ఫిష్ మార్కెట్‌ను మూసేయడం వల్ల నగరంలో పీఎన్ కాలనీ, విశాఖ-బి కాలనీ జంక్షన్, బలగ మెట్టు వంటి ప్రాంతాల్లో చేపల అమ్మకం ప్రారంభమైంది. ఇప్పుడు కరోనా లేకపోయినా అక్కడ మార్కెట్ మాత్రం బలంగా కొనసాగుతోంది.

### ప్రత్యామ్నాయం మాటేమిటి?

గతంలో మార్కెట్‌ను పునర్నిర్మించినప్పుడు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించారు. కానీ ఇప్పుడు ఆ ఊసు లేకుండానే తొలగింపు ప్రక్రియ ప్రారంభం కావడంతో ఉన్న ఫళంగా మార్కెట్‌ను ఖాళీ చేసి ఎక్కడికి వెళ్లాలని వ్యాపారులు ప్రశ్నిస్తు న్నారు. గతంలో మార్కెట్‌ను పునర్నిర్మించే ముందు దానికి సంబంధించిన డిజైన్‌ను వ్యాపారులకు చూపి వారి ఆమోదం మేరకు నిర్మిస్తామని చెప్పినా అలా జరగకపోవడం వల్ల పెద్ద డ్యామేజీయే జరిగింది. ఇప్పుడు కూడా అచ్చెన్నాయుడు ప్రకటించిన రూ.25 కోట్లు ఎక్కడ్నుంచి తెస్తారు? ప్రస్తుతం ఉన్న వ్యాపారులందరికీ చోటు కల్పించే డిజైన్‌ను ఎలా రూపొందిస్తారు? ఎప్పటిలోగా నిర్మాణాలు పూర్తి చేసి అందిస్తారు? వంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు లేకుండానే తొలగింపు కార్యక్రమం మొదలు పెట్టేశారు. వాస్తవానికి పెద్దమార్కెట్‌లోని డి-బ్లాక్‌లో 8 షాపులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. వీటి స్థానంలో కొత్తవి నిర్మించాలన్న ప్రతిపాదన 2014లో గుండ లక్ష్మీదేవి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఉంది. ఈమేరకు అప్పటి కలెక్టర్ లక్ష్మీనృసింహాన్ని మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ కలిసి డి-బ్లాక్ స్థానంలో ప్రత్యామ్నాయ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇప్పుడు కూడా మార్కెట్‌లో వ్యాపారస్తుల డిమాండ్ అదే. కానీ వారేం చెప్పారో, వీరికేం అర్థమైందో తెలీదు కానీ మొత్తం మార్కెట్‌నే కూలగొట్టేస్తామని కమిషనర్ ప్రకటిస్తున్నారు.

### వ్యాపారులు కోరని పునర్నిర్మాణం

వాస్తవానికి మార్కెట్ పునర్నిర్మాణాన్ని ఇక్కడి వ్యాపారస్తులెవరూ కోరుకోవడంలేదు. ఎందుకంటే కొత్తగా నిర్మించినా అక్కడున్న స్థలంలో అందరికీ గ్రౌండ్ ఫ్లోర్‌లోనే షాపులివ్వడం సాధ్యం కాదన్న విషయం వ్యాపారస్తులకు తెలుసు. ఎందుకంటే పెద్దమార్కెట్ నుంచి కిరాణా వ్యాపారం ఎప్పుడో తరలిపోయింది. ఇక్కడ కేవలం నేల వర్తకులు మాత్రమే ఉన్నారు. ఎప్పుడైతే మార్కెట్‌ను పునర్నిర్మిం చారో అప్పటి వరకు ఉన్న నేలవర్తకుల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. పువ్వులమ్మేవారి దగ్గర్నుంచి అరటిపళ్లు అమ్మేవారి వరకు, కూరగాయల దగ్గర్నుంచి ఆకుకూరలమ్మేవారి వరకు వ్యాపారస్తులు పెరిగారు. ఇప్పుడు వారందరికీ అకామిడేట్ చేయాలి. అక్కడ చేపల మార్కెట్ పోను మిగిలిన స్థలంలో ఇంతమంది వ్యాపారులకు షాపులు నిర్మించడం అసాధ్యం. మార్కెట్ చుట్టూ ఉన్న నాలుగు రోడ్లలోని ఆక్రమణలను తొలగిస్తే అదే చాలు. మార్కెట్‌లోకి అడుగు పెట్టడానికి అవకాశం లేనివిధంగా నాలుగువైపులా రోడ్లు పూర్తిగా ఆక్రమణలకు గురైపోయాయి. మరీ విచిత్రమేమి టంటే.. ఈ నాలుగు రోడ్లను గత వైకాపా ప్రభుత్వం చాలా బలంగా నిర్మించింది. ఇందులో పాతబస్టాండు వైపు తోపుడుబండ్లతోను, మేదరవీధివైపు మేదర్లు, ఫిష్‌మార్కెట్‌కు వచ్చే వాహనాలు, చికెన్ సెంటర్లతో నిండిపోయింది. మార్కెట్ వెనుకవైపు హోల్‌సేల్ మార్కెట్లకు వచ్చే లారీలు, తోపుడుబళ్లు అడుగు పెట్టలేని పరిస్థితికి తీసుకువచ్చాయి. ఇక పందుల సెంటర్ నుంచి మార్కెట్‌కు వచ్చే మార్గం గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఇప్పుడు కొత్త మార్కెట్ నిర్మించినా మార్కెట్‌లోకి అడుగు పెట్టే అవకాశం లేనప్పుడు ఏం లాభమని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ లోపల 50 అడుగుల రోడ్డుందంటే ఎవరూ నమ్మరు. ఎందుకంటే ఇవన్నీ ఆక్రమణలకు గురైపోయాయి. అసలు ఎంతమంది మార్కెట్‌లో వ్యాపారాలు చేస్తున్నారు? అందులో నేలమార్కెట్ ఎంత? ఎవరికి షాపులు ఇవ్వాలి? అన్న సర్వే లేకుండానే కూల్చేస్తాం, కట్టేస్తాం అంటున్నారు. పెద్దమార్కెట్ ఒక పెద్ద తేనెతుట్టె. దాన్ని ఎప్పుడు కెలికినా తియ్యనైన తేనె మాత్రం రాలేదు. తేనెటీగల ముళ్లు మాత్రమే గుచ్చుకున్నాయి. ఈ విషయం అచ్చెన్నకు తెలీక పోవచ్చు. కానీ మార్కెట్‌లో తెలుగుదేశానికి ప్రాతి నిధ్యం వహిస్తున్న కోరాడ హరిగోపాల్ వంటి నాయకులకు తెలుసు.

### సామాజిక ఆర్థిక సర్వే చేపట్టాలి

ప్రస్తుతం ఉన్న మార్కెట్‌ను మళ్లీ పునర్నిర్మించా లంటే సామాజిక, ఆర్థిక, వాస్తవిక భౌగోళిక సర్వేను ముందుగా చేపట్టాలి. అడుగు పెట్టడానికి కూడా అవకాశం లేని మార్కెట్‌కు శాశ్వత కట్టడాలు కల్పించిన ధర్మాన ప్రసాదరావు ఆ తర్వాత ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయారో తెలుసుకోవాలంటే మార్కెట్‌కు మించిన పాఠం ప్రస్తుత రాజకీయ నాయకులకు దొరకదు. అరసవల్లిలోనో, గుజరాతీ పేటలోనో నివాసముంటూ పెద్దమార్కెట్‌లో కిరాణా వ్యాపారం చేసుకునేవారు మూడు తరాలుగా తమ వీలునామాలో తమ ఆస్తులతో పాటు మార్కెట్‌లో కిరాణా షాపు కూడా వాటాగా చూపించారంటే సామాజికంగా దాంతో ఎటువంటి సెంటిమెంట్‌ను కలిగివున్నారో అర్థం చేసుకోవాలి. అటువంటివారికి షాపులు దక్కకపోవడం వల్లే పెద్ద ఎత్తున అసంతృప్తి బయటపడింది. అలాగే అసలు మార్కెట్‌లో ఎంతమంది వ్యాపారులున్నారు? ఎన్ని షాపులు కావాలి? అనే వాస్తవిక సర్వే ఒకటి జరపాలి. అది జరగలేదు. అలాగే మార్కెట్‌కు సంబంధించి ఎంతమంది అర్హులు? ఎంతమంది కాదు? అనేది పార్టీలకు అతీతంగా తేలాలి. ఇంతవరకు ఎటువంటి మ్యాప్ లేకుండా షాపులు కూల్చేస్తాం, కొత్తవి కట్టేస్తా మంటే ఎక్కడి నుంచి నిధులు తెస్తారు? టెండర్లు ఎప్పుడు పిలుస్తారు? అనేది తేలకుండా మార్కెట్‌ను తొలగించడం ఆత్మహత్యాసదృశమే. అదే జరిగితే కోడి రామ్మూర్తి స్టేడియంలాగా, ఒక అరసవల్లి ఆక్రమణల తొలగింపు లాగా మొదలుపెట్టడమే గాని ముగింపు లేని కథగా మారిపోతుంది.

## 9న హజరత్ బంగేషా హుస్సేని చందనోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రకాశ్‌నగర్ కాలనీలోని హజరత్ బాబా బంగేషా హుస్సేనీ దర్గాలో ఈ నెల 9న చందనోత్సవం నిర్వహిస్తున్నట్టు ముతవల్లి ఎంఎ రఫీ హబీబి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 3 గంటలకు గసూల్, ఫజర్ సమాజ్ నుంచి జోహార్ వరకు ఖురాన్ పఠనం, జోహర్ నమాజ్ తర్వాత మిలాద్ ఖాని, అసర్ నమాజ్ నుంచి మగరీబ్ నమాజ్ వరకు చందనోత్సవం (ఖుల్ షరీఫ్) జరుగుతుందని ఆ ప్రకటనలో వివరించారు. అలాగే మగరీబ్ నమాజ్ అనంతరం బయాన్, ఆ తర్వాత లంగర్ జరుగుతాయన్నారు. అలాగే 10వ తేదీన మగరీబ్ నమాజ్ అనంతరం చిరాగ్, సలాం కార్యక్రమం జరుగుతుందని రఫీ ఆ ప్రకటనలో తెలిపారు.

## సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తాం

♦గత ప్రభుత్వం కాలనీలను నిర్వీర్యం చేసింది
♦మేం అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నాం
♦ఎమ్మెల్యే గొండు శంకర్ ♦పలు కాలనీల్లో పర్యటన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం పట్టణంలోని విశాఖ-బి కాలనీ, ఎ-కాలనీ, గోవింద్ నగర్, శ్రీనివాసనగర్, మహాలక్ష్మినగర్, సాయిలక్ష్మీనగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా లేదని, గత ప్రభుత్వం ఈ ప్రాంతాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ విమర్శించారు. మంగళవారం ఆయన పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాలు చేపడతామని, త్వరలో ఆ పనులు ప్రారంభించి, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, త్వరలో పనులు ప్రారంభించే విధంగా ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హెల్త్ ఆఫీసర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాజుగారి తప్పులకు డీజీఎం తందానా!

జిల్లాలో సంచలనం రేపిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) గార బ్రాంచి తాకట్టు నగల కుంభకోణంలో తెర వెనుక మరో పాత్ర బయటకొచ్చింది. ఇంతవరకు గార బ్రాంచిలో తాకట్టు బంగారం మాయం కావడం, మళ్లీ ప్రత్యక్షమవడం, మధ్యలో అసిస్టెంట్ మేనేజర్ స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకోవడం, ఆమె కుటుంబాన్ని బాధ్యుల్ని చేస్తూ జైలుకు పంపడం వంటి దరిద్రాలకు కారణం అప్పటి రీజనల్ మేనేజర్ టీఆర్ఎం రాజు అని బ్యాంకు వర్గాలన్నీ ఒక అవగాహనకు వచ్చిన తరుణంలో ఇంతవరకు రాజు మీద చర్యలెందుకు లేవు? అన్న ప్రశ్న వేసుకుంటే.. ఈ తెర వెనుక పాత్ర బయటపడింది. విశాఖపట్నం ఎస్‌బీఐ మాడ్యూల్‌కు డీజీఎంగా వ్యవహరిస్తున్న ఒక అధికారికి మొదట్నుంచీ టీఆర్ఎం రాజు తప్పుడు సమాచారం అందించడంతో ఆయన పూర్తిగా గాడితప్పి వ్యవహరించినట్టు బ్యాంకు వర్గాలు భావిస్తున్నాయి. గార వ్యవహారంలో ఈ డీజీఎం, అప్పటి ఆర్ఎం రాజు ఇద్దరూ కలిసి పోలీసులను తప్పదోవ పట్టించారని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది.



✶గార ఎస్బీఐ కుంభకోణంలో తెరవెనుక మరో పాత్ర
✶తప్పుడు సమాచారంతో అతన్ని తన దారికి తెచ్చుకున్న మాజీ ఆర్ఎం
✶స్వప్నప్రియ ఆత్మహత్య విషయంలో ఆ అధికారి అత్యుత్సాహం
✶చావుబతుకుల్లో ఉన్న ఆమెతో ఖాళీ కాగితాలపై సంతకాలు ఎందుకు?
✶న్యాయం చేయాలని ఇటీవల ఢిల్లీలో కుటుంబ సభ్యుల ధర్నా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గార బ్రాంచిలో తాకట్టు బంగారం మాయమైనప్పుడు కేసు రిజిస్టర్ చేయాల్సి వచ్చింది. దీనికి సంబంధించి బ్యాంకు లా ఆఫీసర్ డ్రాఫ్ట్ చేసిన ఫిర్యాదును మార్చేసి ఇక్కడ వేరేగా తయారుచేసి అప్పటి ఆర్ఎం రాజు పోలీసులకు ఇచ్చారు. దీనికి డీజీఎం సహకరించారని తెలిసింది. టీఆర్ఎం రాజు ఫోన్‌లో మౌఖికంగా డీజీఎంతో మాట్లాడి ఆయన నుంచి మెసేజ్ ద్వారా ఆదేశాలు తెప్పించుకున్నారని.. తీరా ఇప్పుడు ఆయన్నే బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టు భోగట్టా. డీజీఎం చెబితేనే తాను చేశానని టీఆర్ఎం రాజు ఉన్నతాధికారులకు చెబుతున్నట్టు సమాచారం. వాస్తవానికి ఇక్కడ ఏం జరిగిందనే విషయాన్ని పక్కన పెట్టి డీజీఎంకు తప్పుడు లెక్కలు చెప్పి, ఆయన ద్వారా ఆదేశాలు తెప్పించు కొని ఇప్పుడు ఆయన్నే బుక్ చేసినట్టు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ డీజీఎంకు, టీఆర్ఎం రాజుకు మధ్య ఏదో అవగాహన ఉందని, అందుకే శ్రీకాకుళం జిల్లాలో ఎస్‌బీఐ బ్రాంచిల్లో ఏదో ఒక మూల ఏదో ఒక డ్యామేజ్ జరుగుతున్నా ఏరోజూ డీజీఎం హోదాలో ఏ శాఖనూ ఆయన పరిశీలించలేదు. ఒకవేళ శ్రీకాకుళం వచ్చినా ఎప్పుడు వస్తున్నారో తెలియకుండా దొంగచాటుగా వచ్చి వెళ్లిపో తున్నారు. గార బ్రాంచిలో పెద్ద ఎత్తున బంగారం మాయమవడం, తమ ఉద్యోగి ఒకరు ఆత్మహత్య చేసుకోవడాన్ని ఆయన అసలు సీరియస్‌గా తీసుకోలేదు. నరసన్నపేట బజారు బ్రాంచిలో నకిలీ రుణాల కుంభకోణం వెలుగు చూసిన ప్పుడు దాన్ని 'సత్యం' పత్రికే తొలిసారి బయటి ప్రపంచానికి చెప్పింది. కానీ డీజీఎం మాత్రం అవన్నీ తప్పుడు కథనాలంటూ చీఫ్ జనరల్ మేనేజర్‌కు ఓ నివేదిక ఇచ్చినట్టు భోగట్టా. అయితే ఇప్పుడు అదే బజారుబ్రాంచ్ ఇష్యూపై దర్యాప్తు చేయాలని బ్యాంకు అధికారులే సీఐడీని కోరారు. అలాగే శ్రీకాకుళం మెయిన్ బ్రాంచిలో కూడా అవకతవకలు జరిగాయి. మరో బ్రాంచిలో డ్వాక్రా రుణాల కుంభకోణం, తప్పుడు పత్రాలతో రుణాల మంజూరు వంటివి వెలుగుచూశాయి. వీటన్నింటి పైనా డీజీఎం ఇన్నాళ్లూ చూసీచూడనట్లు వ్యవహరించారు.

### వ్యక్తిగత నోటీసులకు బ్యాంకు లాయర్ ఎందుకు?

ఈ ఏడాది డీజీఎంకు జీఎంగా పదోన్నతి రావాల్సి ఉంది. అదే సమయంలో తన పరిధిలో ఉన్న శ్రీకాకుళం జిల్లాలోని పలు శాఖల్లో అవకతవకలు జరిగాయని బయటపడితే ప్రమోషన్ ఆగిపోతుందన్న భయంతో టీఆర్ఎం రాజు చెప్పినట్టల్లా ఆడి సీజీఎం స్థాయి అధికారులకు తప్పుడు నివేదికలు ఇచ్చారని తెలిసింది. గార బ్రాంచి విషయంలో టీఆర్ఎం రాజుకు హైకోర్టు న్యాయవాది నుంచి నోటీసులు వస్తే.. తాను శ్రీకాకుళం రీజనల్ మేనేజర్‌ను కానని, తనకు సంబంధం లేదని రిజక్ట్ చేశారు. అయితే ఇది ఆర్ఎం హోదాకు ఇచ్చిన నోటీసు కాదని, వ్యక్తిగతంగా ఇచ్చినదని చెప్పడంతో దాన్ని తీసు కున్నారు. కానీ రాజు తరఫున హైకోర్టులో వాదించడానికి బ్యాంకు నుంచి లాయర్‌ను పెట్టుకోడానికి డీజీఎం పరోక్షంగా అనుమతు లిచ్చినట్టు ఆరోపణలున్నాయి. గార బ్రాంచి ఇష్యూలో ముంబై ప్రధాన కార్యాలయానికి తప్పుడు నివేదికలు ఇచ్చింది కూడా సదరు డీజీఎం అని తెలిసింది. స్వప్నప్రియ కుటుంబ సభ్యులే ఆమెను చంపేశారని, అలాగే క్యాష్ ఇన్‌ఛార్జి సురేష్‌ను కొట్టించారని ఓ పథకం ప్రకారం కథనాలు రాయించి, వాటిని సోషల్ మీడియాలో ట్రోల్ చేయించి, ఆ తర్వాత ఇంగ్లిష్‌లోకి తర్జుమా చేసి ముంబై ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇచ్చినట్టు తెలుస్తుంది.

### అతని ప్రమేయానికి ఆధారలివే!

స్వప్నప్రియ ఆత్మహత్యకు పురికొల్పే వాతావరణాన్ని కల్పించినవారి పాత్రను బయటకు తీయాలని కోరుతూ ఇటీవలే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద స్వప్నప్రియ కుటుంబ సభ్యులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్కడికి నెల క్రితం స్వప్నప్రియ తల్లి ఉరిటి సరళ సామాజిక న్యాయ శాఖ మంత్రిని కలిసి ఎవరి ద్వారా ఎవరికి డబ్బులు వెళ్లాయి? కథనాలు ఎలా వచ్చాయి? స్వప్నప్రియ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులేమిటి? ఆ తర్వాత బ్యాంకు అధికారులు వ్యవహరించిన తీరుపై దర్యాప్తు జరపాలని కోరారు. 2023 నవంబరు 23న రాత్రి 9 గంటల ప్రాంతంలో జాయింట్ కస్టోడియన్/ క్యాష్ ఆఫీసర్‌గా ఉన్న ముంజు సురేష్‌పై దాడి జరిగిందని పోలీసులకు ఫిర్యాదు వెళితే.. 9.10 గంటలకే ఈ దాడి స్వప్నప్రియ కుటుంబ సభ్యులు చేయించారంటూ ఈ డీజీఎం ముంబై ప్రధాన కార్యాలయానికి మెయిల్ పంపడం కొసమెరుపు. గార బ్రాంచిలో ఏం జరిగిందో తెలియనట్లు వ్యవహరించిన డీజీఎం ఈ విషయంలో మాత్రం పదే పది నిమిషాల్లో తానే ఇన్వెస్టిగేట్ చేసేసి స్వప్నప్రియ కుటుంబంపైకి నేరాన్ని నెట్టేస్తూ మెయిల్ చేయడం కంటే దారుణం మరోటి లేదు. డీజీఎం, అప్పటి ఆర్ఎం రాజు కలిసి స్వప్నప్రియ ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య పోరాడుతుంటే డీజీఎం ఆఫీసులో చీఫ్ మేనేజర్‌గా పని చేస్తున్న సత్యసాయిబాబాను ఆస్పత్రికి పంపించి ఐసీయూలో ఉన్న స్వప్నప్రియ ఫొటోలు తీయించి, తెల్లకాగితాల మీద సంతకాలు పెట్టించుకోవడం చూస్తే డీజీఎం పాత్ర మరోసారి బయటపడిందని స్వప్నప్రియ కుటుంబ సభ్యులు జంతర్‌మంతర్ వద్ద జరిపిన ధర్నాలో నినాదాలు చేశారు. సత్యసాయిబాబా కాల్‌లిస్ట్‌ను కూడా బయటపెట్టాలని, ఫొటోలు, తెల్లకాగితాల మీద సంతకాలు ఎందుకు తీసుకున్నారో చెప్పాలని వీరు కోరుతున్నారు.

## జనాలను రోడ్డున పడేయడం ఆపండి

☆స్టేడియం పూర్తి చేసి మాట్లాడండి
☆కొత్త మార్కెట్ నిర్మిస్తే అద్దెలు పెరుగుతాయి
☆వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కూటమి ప్రభుత్వానికి, మరీ ముఖ్యంగా శ్రీకాకుళం నేతలకు జనాలను రోడ్డున పడేయడం అలవాటుగా మారిపోయిందని, ప్రత్యామ్నాయ వసతులు చూపక ముందే జనాల బతుకులను రోడ్డుకు ఈడుస్తున్నారని, దీనిని మానుకోవాలని టీడీపీ నాయకులకు వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం హితవు పలికారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక కేఆర్ స్టేడియంను పునర్నిర్మిస్తామని కూలదోసేసిందని, ఇప్పటికీ దానిని నిర్మించలేకపోయిందని, దీంతో జిల్లా క్రీడాకారులంతా రోడ్డున పడినట్లయిందన్నారు. ఇప్పుడు లక్షణంగా ఉన్న పొట్టి శ్రీరాములు పెద్దమార్కెట్‌ను కూలదోసి కొత్తగా ప్రైవేట్ పబ్లిక్, ప్రభుత్వ భాగస్వామ్యంతో షాపులు నిర్మించడానికి సిద్ధపడుతున్నారని, దీనివలన నగరంలో చిరు వ్యాపారులకు తీవ్ర నష్టం జరగుతుందన్నారు. ప్రస్తుతం రూ.3వేలు ఉన్న అద్దె రూ.30వేలు దాటుతుందని, ఇది శ్రీకాకుళం నగరానికి సరిపోదన్నారు. రథసప్తమి సందర్భంగా అరసవల్లిని అభివృద్ధి చేస్తామని స్థానికులను, వ్యాపారులను అక్కడి నుంచి వెళ్లగొట్టి ఇప్పటికీ వారికి ప్రత్యామ్నాయం చూపలేదని పురుషోత్తం ఆరోపించారు.

ఇప్పుడు పెద్దమార్కెట్ వ్యాపారులకు కూడా మరోచోటు చూపించకుండా రెండురోజుల్లో షాపులు ఖాళీ చేయాలనడం పాలకుల తెలివితక్కువతనానికి నిదర్శనమన్నారు. స్థానిక డీసీసీబీ కాలనీ విస్తరణలో 80 అడుగుల రోడ్డు కోసం విడిచిపెట్టిన స్థలంలో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపడుతున్నా పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారని, దీనిపై వైకాపా క్షేత్ర పరిశీలన చేస్తుందని పురుషోత్తం పేర్కొన్నారు. 2014లో కూలదోసిన స్టేడియంకే ఇప్పటికీ దిక్కూమొక్కూ లేదని, ఇప్పుడు మార్కెట్‌ను కొట్టేసి ఎప్పటికి పూర్తి చేస్తారో ఎవరికీ తెలియదన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.